పెద్దకథ

# అచ్చిరాని మేడలో—

పార్వతి

(గతసంచిక తరువాయి)

లీల తండ్రి హఠాత్తుగా పక్షవాతంవచ్చి మంచాన పడ్డాడు. అందుకు తగ్గ చికిత్స చేయించేసరికి చాలా డబ్బు అయిపోయింది. పెళ్ళికని తెచ్చిన డబ్బు సగమయింది. అంతక్రితంరోజే పిల్లాడు వచ్చి చూసుకునిపోయాడు. పిల్లాడు నల్లగా పొట్టిగా వుంటాడు. స్కూలుఫైనల్ ప్యాసయి ఏదో కంపెనీలో డెబ్భైరూపాయిలు కాబోలు సంపాదిస్తున్నాడుట. లీల పిల్లాడిని కన్నెత్తి చూడను కూడా లేదు. తనకోసం తల్లీ, తండ్రీ ఎంత బాధ పడ్తూన్నదీ చూస్తూనే వుంది. "నేను పెళ్ళి చేసుకోను" అని అంది. తల్లి కొరకొరా చూసి కోపంగా అరచింది, "నీ మంచిచెడ్డల్ని నిర్ణయించే అధికారం యింకా మాపైనే వుంది లీలా! పిచ్చి వేషాలువేయక చీరకట్టుకుని పద" అంది. జానకమ్మ తనమెళ్ళో గొలుసుతీసి పిల్ల మెళ్ళో వేసింది. పిల్లాడితాలూకువాళ్ళు వెళ్ళినతరువాత గదిలో ఏక ధారగా ఏడ్చింది లీల. ఎవరుమాత్రం ఏంచేయగలరు? జానకమ్మ లీల తల్లితో అంటూంది, "పిల్లాడు మరీ నల్లగా పొట్టిగా వున్నాడు. మనపిల్ల పాటి పొడుగు లేడు..."

"ఏముండిలెండి ఒదినెగారూ! మా పిల్లని తీసికెళ్ళి పోషించగలడు అదే చాలు. మాకున్న స్తోమతుకి మించిమాత్రం ఎవరు వస్తారు ఒదినా?..." అని కంట తడిపెట్టుకుంది.

మర్నాడు పిల్ల పొడగరని కబురు రానే వచ్చింది. ఇంతలోనే తండ్రి మంచానపడ్డాడు. తనని చూసుకుని లీల చాలా సిగ్గుపడిపోయింది. తను కేవలం ఒక పేదకుటుంబంలో జన్మించింది. ఇంకా తనవెనక పిల్లలున్నారు. యింతకన్నా తనకి మాత్రం ఎవరొస్తారు? అదిమాత్రం నిజం. కాని ఏదో యితరమైన బాధతో ఎవరూ నిర్ణయించ ఆశలతో క్రుంగిపోతోంది. తండ్రికి సేవ చేస్తూ లీల రాత్రి తెల్ల వార్లూ కాస్తోంది. తల్లి రాత్రి నసుక్కుంటూ అంది, "వెధవ పనికిరాని వెంకితనమూను, ఏడ్పూను. నీ ఏడ్పుకొట్టు మొహంచూసి ఏ మహారాజు దిగుతాడే!...ఏమైనా యింత రంగున్నా పోనీ చెల్లిపోయేదానివి. నలుపూ, పైగా తాడెమ్మలా పొడుగొకటీను. ఇప్పటికైనా గ్రహించుకుని, తల్లిదండ్రులు పరమదరిద్రులు యింతకన్నా తేలేరని నిర్ణయించుకో. నేనేమైనా అనుభవిస్తూంటే అడగొచ్చు. నా జన్మకి నాకొక బంగారు గొలుసు తాటాకులా వున్నది తప్పించి వేరేలేదు. ఉన్నదంతా నీ మొహాన్నే పెట్టాను. చూడు, తమ్ముడు యింత చలిలోకూడా బట్ట లేకుండా తిరుగుతూనే వున్నాడు. మూడో చొక్కా లేదు. నా ఎదురుగా లే పాపిష్టి దానా!"అని అనేసరికి లీల లేచి యివతలకొచ్చింది. తండ్రి జబ్బు, యింట్లో ఖర్చు ఎక్కువగావుంది. తల్లి అన్న యీ మాటలకి తనకి ఏ నూతిలోనో పడి చావాలనిపించింది. ఉక్రోషంతో రాత్రి తెల్ల వార్లూ ఏకపెట్టున ఏడ్చింది.

రాత్రి పన్నెండుగంటల బండికి సుందరబాబు రానేవచ్చాడు. ఈ ఏడాదితో చదువు ఆఖరవుతుంది. వచ్చీరావటంతోనే తల్లిని అడిగాడు యింటి సంగతులు. జానకమ్మ తలుపుమూస్తూ అంది, "వారింట్లో గణపతిరావుకి పక్షవాతం వచ్చి కొద్దిగా నయమయింది. అంతకన్నా పెద్ద విశేషాలేవీ లేవు."

తెల్లవారి లేచి అంతా ఎవరిపనులు వారు చేసుకుంటున్నారు. లీలకి పక్కకి చూసేందుకు కూడా తెరిపిలేదు. భర్తకి నయమయింతరువాత కొన్నాళ్ళ పాటు పుట్టింటికి వెళ్ళాలని రాజమ్మ నిశ్చయించుకుంది. ఈ మధ్య జానకమ్మగాని, లీలగాని అట్టే ఒకరిజోలొకరు మాట్లాడిందిలేదు. జానకమ్మతో మాట్లాడేందుకు లీలే సాహసిస్తుంది. రాజమ్మ

అకారణంగా వెళ్ళి ఎప్పుడూ కూర్చోలేదు. మధ్యాహ్నం భోజనాలముందు మెల్లిగా అంది, "లీలకి సంబంధాలు చూస్తున్నారు. మొన్న ఒక పిల్లాడు చూసిపోయాడు. అది ససిపడలేదు... ఐనా నల్లగా వుంటే ఎవరూ ముందుకురారు" అని అనేసరికి సుందరబాబుకి లీల పొద్దుటినుండీ ఎందుకు కన్పించనిదీ క్షణంలో అర్థమయింది. లీల కన్పించకపోతే తన మనసు విహ్వలమయింది. మామూలుగా మాట్లాడి తన కళ్ళెదుట చిన్న దానిలా తిరిగే లీల, యిప్పుడొక పెద్ద సమస్యయి కూర్చుంది. ఎంత వద్దనుకున్నా తన భావాలు లీలమీదికే ప్రసరిస్తున్నాయి.

"లీలకిష్టమయిందా?..." అని అడిగాడు తల్లిని. అలా తను అడగాలని అనుకోకపోయినా అందులో కొంత పక్షపాత బుద్ధి కన్పిస్తూనే వుంది. లీలకే పై సంబంధం యిష్టమయినట్లయితే తను పెద్ద నిందారోపణచేసి తిట్టాలనుకున్నాడు. అలా అడగటంలో అర్థంకూడా ఏమంటే తనతోపాటు అందరూ కూడా లీలని ప్రేమించి లాలించగల రన్న నమ్మకం కూడా!... ఆ శక్తి లీల కళ్ళలో వుందనే నమ్మకం. "అదంతా నాకు తెలియదు కాని, పిల్ల పొడగరని వదిలేశారు వాళ్లు. ఏమయితేనేం బాబూ, యీ ఆడపిల్లల్ని కనగానే సరిపోదు, వాళ్లు ఒక్కొక్క ఏడాది ఒక్కొక్క బెంగపెట్టిస్తారు తల్లికి. వాళ్ళతో స్వర్గానికెళ్ళినా శాంతి వుండదనుకుంటాను."

ఏది ఎలావున్నా జానకమ్మ ఒకవిధంగా లీలని యిదివరకు ప్రేమించి, పొగిడినా యిప్పుడు లీల తల్లిదండ్రులకన్నా తనకెక్కువ బెంగగా వుంది లీల పెళ్ళికావాలని. అందులో ఏమాత్రమూ సందేహపడటానికి తావులేదు. సుందరబాబు గదిలోకి లీల వెళ్ళి మాట్లాడిరావటం తను కిటికీద్వారా చూడనేచూసింది. ఇదే కారణంతో యీ నల్ల పొడగరి పిల్ల తన కొంపకూడా కూలుస్తుందని భయపడిపోతోంది. తల్లి జవాబు విని సుందరబాబు మేడఎక్కాడు. నేరేళ్ళకూతురు కన్నమ్మ గదులన్నీ తుడుస్తూ అబ్బాయిగారి గదిలోకెళ్ళింది. ఈ మధ్యకాలంలో లీలకీ తనకీ మధ్యవర్తినిగా అదే పనిచేస్తోంది కూడా. సుందరబాబు తలకింద చెయ్యి పెట్టుకుని ఆలోచిస్తూ పడుకున్నాడు. కన్నమ్మని చూడగానే కొంత ప్రాణం చేరుకుంది.

"ఏయ్ పిల్లా!... లీల ఏంచేస్తోందే వాళ్ళింట్లో?"

"లీలమ్మగారు గదిలో పండుకున్నారుబాబూ. ఇవాళ అన్నంకూడా తిన్నట్టులేదు... తలనొస్తం దన్నారు. నేను పడతానని కూడా అడిగాను... అయినా, అమ్మాయిగారికి చాలా కష్టంగా ఉంది బాబూ..." అని తుడుపుకెళ్ళింది. శ్యాము మామ చెయ్యి పట్టుకుని అన్నాడు, "మామా!... నాతో కాలువదాకా షికారు రా మామా... నాకు ఏమీ తోచటంలేదు. రోజూ అయితే లీలత్త మాకు ఆటలు చెప్పేది. ఈ మధ్య గవ్వలాట కూడా బాగా ఆడుతున్నాం మామా..."

"ఓరి! లీలని అత్తని ఎవరు పిలవమన్నారురా నిన్ను?"

"తనే అంది నాతో 'నేను నీకు అత్తనవుతాను, నన్నలా పిలిస్తేనే మాట్లాడుతా'నంది... పాపం తను యివాళ్లా లేవనేలేదు. కళ్ళు చాలా వుబ్బిపోయాయి."

"ఎందుకని లేవలేదు?"

"ఏమో అదంతా నేను అడగనూలేదు, లీలత్త చెప్పనూలేదు. ఉఁ పద మామా... మామ్మ నీతో వెళ్ళమంది. తాతగారు ఎవరితోనో మాట్లాడుతున్నారుట గొడవచేస్తే కోప్పడతారని మమ్మల్ని నీతో వెళ్ళమంది."

తను యింతవరకూ తండ్రిని పల్కరించి ఆట్టే మాట్లాడలేదు. శ్యాముచెప్పిందంతా వినేసరికి వెళ్ళి కనుక్కోవాలన్న బాధ పీడిస్తోంది. శ్యాముని దగ్గరకిపిల్చి చెవిలో చెప్పాడు:

"లీలత్తని సుందరబాబు పిలుస్తున్నాడని చెప్పు... ఎవరేనావుంటే నీతో ఆడుకుందుకు రమ్మను. ఏం?"

శ్యాము పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. ఈలోపున తను తలదువ్వుకుని బట్టలు మార్చుకున్నాడు. శ్యాము వచ్చి, లీల రావటానికి వీలుపడదని చెప్పిందని చెప్పాడు. మరి కాసేపుండి నిజం చెప్పాడు, "లీలత్త అసలు నాకు కనపడలేదు మామా..." ఇదంతావిని తెల్లబోయాడు సుందరబాబు.

• • •

దానంతట అది ఎంతపెరిగినా 'తీగకి'—?
సున్నితమైన లతకి—అధమం వర్షపు నీ

అవసరం...అందుకుకూడా భగవంతుడు కరుణించక పోతే మరేంచేయాలి!...లీలకి ఎటువంటి ఆశలూ ఫలసిద్ధి అయేట్టు కన్పించడంలేదు. సుందరబాబుతో యిదివరకు మాట్లాడినా, వారింటికెళ్ళినా ఏమీ అంత పర్వా వుండేదికాదు. ఇప్పుడలా కాదు. తను యింట్లోకాదు, వీధిలోకాదు ఏపని చేయబోయినా అనేక అర్థాలు పుడుతున్నాయి. అవన్నీ తను వూహించుకోనుకూడా తెలీవు. రాజమ్మ ఒకనాడు కూతుర్ని వెంటేసుకుని ప్లీడరుగారి యింటికి కెళ్ళింది. చెప్పబోయేదేమంటే, వారింట్లో ఒక పిల్లాడు పెళ్ళికున్నాడని విన్నది అంత క్రితం. స్వయంగా వెళ్ళి అట్టే పరిచయం చేసుకోకపోయినా వారికీ వీరికీ ఏవో సంబంధబాంధవ్యాలు వుండేవట. తనైతే కూతుర్ని పెళ్ళిమిషతో తీసికెళ్లినా వారి కివేవీ తెలీనే తెలియదు.

"మా పిల్లసంగతి మీరు వినేవుంటారు...మా పిల్ల ఏమంత అందమైందని నేనూ చెప్పనుకూడా. కాని యీవేళ లోపునే ఏదో ముడిపెట్టి పంపాలని వుంది."

"ఎదిగిన పిల్లని యింట్లో వుంచుకుని ఎవరు సుఖపడ్డారు లెండి. మావాడికీ పెళ్ళిచేయాలనుకుంటున్నాం ఏమో దైవసంకల్పం ఎలా వుందోను.." అంది ఆమె. ఇదేవిధంగా వారి సంగతి తెల్సుకుని వచ్చింది. ఇద్దరూ మాట్లాడుతూండగానే కుంటు కుంటూ పాతికేళ్ళ యువకుడు రాబోయి వెళ్ళి పోయాడు సిగ్గుపడి. లీల మాత్రం అతడిని అతి స్పష్టంగా చూసింది. దబ్బపండు రంగు, ఒడ్డూ పొడుగు, ముఖవర్చస్సు చూస్తే బాగానే ఉన్నాడు.

ఇంటికి రాగానే భర్తకి పళ్ళరసం యిచ్చి చెప్తోంది, "యివాళ ప్లీడరుగారి అబ్బాయిని చూసొచ్చాం. మన లీలని వారికి పరిచయంచేసి ఒకమారు వాళ్ళసంగతికూడా తెల్సుకురావచ్చని తీసికెళ్ళాను...మన పిల్లని యిద్దామని చేద్దామని అందామా?...పిల్లాడు పచ్చగా ఒడ్డు పొడుగూ బాగానే వున్నాడు...కాని" యింక చెప్పలేక పోయింది. ఛీ!...ఈ ఆడపిల్లల్నికని యింత విషం పెట్టి చంపకపోతేనేం! ... అంది హృదయ ఘోష. ఈ మాటకి ఆశ్చర్యంగా చూశాడు గణపతిరావు. "అంత పెద్దసంబంధంవాళ్ళు మన పిల్లని చూడటానికి కూడా రారు..."

"రాకేంలెండి ... చేసుకుందుకు కూడా సిద్ధపడ్డారు...అందుకు సందేహంలేదు..."

"అంత నిర్ధారణగా ఎలా చెప్పగలవు రాజం!" అని అడిగాడు శంకగా. లీల పక్కనించి అంతా వింటూనేవుంది.

"పిల్లాడు కుంటివాడు లెండి... అయితేనేం అందచందాలకిగాని, ఆస్థిపాస్తులకిగాని లోటులేదు. మనపిల్ల సుఖపడ్తుంది."

లీల ఎంత సుందరబాబుతో మాట్లాడకుండా వుందామనుకున్నా వుండలేక పోతోంది. అలా అనుకున్న కొద్దీ ప్రేమ, ఆందోళన, భయం మరి కాస్త హెచ్చువుతూనే వున్నాయి. తల్లి రహస్యంగా పిల్చి చెప్పింది, "అమ్మాయి!...నువ్వు యిదివరకూలా అక్కడికీ యిక్కడికీ వెళ్ళటంకాని, పెద్ద మగపిల్లలతో మాట్లాడ్డం కాని కూడదు. ఎక్కడికెళ్ళినా, నాతో చెప్పిపోతూండు." అని హెచ్చరించింది.

లీలకి సాయంత్రంలోపున అనేక కబుర్లు వచ్చి పడ్డాయి. ఇంక ఆగలేక వెళ్ళి మేడ ఎక్కింది. సుందరబాబు సిగరెట్టు కాల్చుకుంటూ ఏదో ఆలోచనగా వున్నాడు. లీలని చూడగానే స్తబ్ధులా వుండిపోయాడు. లీల గుమ్మంలో తలదించుకుని పమిటచెంగు వేలికి మెలిపెడుతూ నుంచుంది.

"దగ్గరగా రా లీలా! ఎందుకలా సిగ్గుపడతావు నా దగ్గర! తెల్లవారి లేచి నీ దర్శనభాగ్యం లేక యిలా తోచకుండా కూర్చున్నా తెలుసా!..."

"మీరు పిల్చిన పనేదో త్వరగా తెముల్చి చెప్పండి. నేను అమ్మకి తెలీకుండా వెళ్ళాలి."

"ఏమైనా, అభ్యంతరాలూ, ఆటంకాలూ వచ్చి పడ్డాయా నీకు?"

"మీకు మటుకు తెలీనిదేముంది? చాలాపనిలో వున్నాను. నాన్నకి యింకా శక్తి చేరుకోలేదు."

"ఎవరైనా వినగలరు అంత దూరంనుంచి మాట్లాడితే! యిలా రా! మరి మన సంగతి ఏమాలోచించావు?" అని నవ్వాడు వింతగా.

"ఏసంగతి సుందరబాబూ! నాకేం తెలీలేదే!" అంది నేరస్థురాలికి మల్లే.

"మనిద్దరి పెళ్ళిసంగతీను. నీతో యీ సంగతే మాట్లాడాలని ఎన్నాళ్ళనుంచో నిశ్చయించుకున్నా, నువ్వు నాకు కన్పిస్తేగా చెప్పటానికి!"

"నేనీవిషయం కలలోకూడా ఊహించలేదు సుందరబాబుగారూ! అందుకు తగనుకూడా! నా బతుక్కి కుంటివాడికన్నా విలువైనవాడు రావటం కష్టం." అని వెక్కివెక్కి ఏడ్చింది.

సుందరబాబు ఆ క్షణంలో ఏ జవాబూ చెప్పలేక పోయాడు. "నీ హృదయంలో ప్రేమ కలశం వుంది లీలా. కుంటివాడికిచ్చి ఎలా చేస్తారో చూస్తాను. నువ్వు మాత్రం మళ్ళా కన్పించు ఆలోచించి చెప్తాను." అన్నాడు బరువుగా.

• • •

లీల సుందరబాబు వేసే ఆర్డర్ కోసం ఎదురు చూస్తోంది. రాత్రల్లా ఆలోచించినా సుందరబాబుకి, యిటు గణపతిరావుకి ఆలోచన పాలుపోవలేదు. ఇద్దరూ కూడా పెద్ద సుడిగుండంలో చిక్కుపడ్డారు. రాజమ్మ ఆ సంబంధం చేయాలని చాలా పట్టుగావుంది. నెమ్మదిగా గోడపట్టుకుని నడిచి సర్వేశ్వరరావుగారి ఆఫీసుగదిలో కెళ్ళాడు. సర్వేశ్వరరావుగారు కుర్చీ జరిపి చెయ్యిపట్టుకుని నెమ్మదిగా కూర్చోపెట్టారు.

"బాబుగారూ! మీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలని వచ్చాను. నాకూ ఏమీ పాలుపోవటంలేదు. నాకు సలహాలిచ్చినా ఏంచేసినా మీరే మిగిలివున్నారు బాబూ. మీ సహాయంతోనే నేను బతికి పోతున్నాను."

"అలాంటి మీమాంస ఏమీ పడకు గణపతీ!... త్వరలో ఆరోగ్యం చేకూరి తిరిగి నీ పని నువ్వు చూసుకుంటావులే. ఇంతకూ ఒకళ్లు ఒకళ్ళకి చేసేది మాత్రం ఏమంత వుంటుంది? మీరు వుండటంవల్ల మాకు ఏవిధమైన యిబ్బందీ లేదు." అన్నారు.

"లీలకి ఏదో సంబంధంవచ్చింది బాబూ. పిల్లాడు ఎమ్. ఏ. ప్యాసయి ఏదో వుద్యోగం చేసుకుంటున్నాడు. అందచందాలకి లోటులేదు గాని, కుంటిలెండి." అని సిగ్గుతో తల దించుకున్నాడు.

"ఏమన్నావు గణపతిరావూ? పిల్లాడు కుంటివాడా? నీకు మతిగాని పోలేదు కదా! రత్నంలాటి పిల్లని గంగలో దించుతామని చూస్తున్నావనమాట! నన్ను యిలాటి సలహాలు, ఆలోచనలు అడుగ అవసరంలేదు. నాకు చెప్పటంకూడా చేతకాదు." అన్నాడు కోపంగా. ఆ సమయంలో ఆయన మొహం, కోపంతోను ఆశ్చర్యంతోను ఎర్రపడిపోయింది. నిజంగా తన కన్న కూతుర్నన్నట్టే బాధపడ్డాడు.

"పిల్ల ఎవరికీ నచ్చటంలేదు బాబుగారూ. ఇంక పదహారేళ్ళు, పదిహేడేళ్ళ పిల్లని యింట్లో పెట్టుకుని ఎలా బతకమో చెప్పండి! నాకు వేలు కట్నాలు పోసి చేసే స్తోమతు లేదు."

"నా కళ్ళెదుట పిల్లదాన్ని అలా చేయటం నాకు మాత్రం యిష్టముండదు గణపతిరావ్! లీల నా కళ్ళ ముందు పెరిగి పెద్దదవడంతో నా యింట్లో పిల్లలాగే వుండిపోయింది. లీల మొహంలోని కళ కాంతులు చూసి చేసుకోలేనివాడు నిజంగా పాపాత్ముడు, తుచ్ఛుడు, అన్నమాట!"

"మన పిల్ల మనకి నచ్చితే చేసుకునేవాడికి నచ్చొద్దూ?..." "అందుకు యిలాటి అఘాయిత్యం తలపెడతావన్నమాట! అయితే యీ విషయం నాతో చెప్పి ఆలోచించాల్సిన అవసరం లేదనుకుంటాను. ఈ పెళ్ళి నాకళ్ళెదుట మాత్రం జరగటానికి వీలులేదు. నీ శాస్త్రాలు, నీ నమ్మకాలు ఆఖరికి యింతగా కొంపతీస్తాయని కూడానే ననుకోలేదు" అని కూర్చుండి పోయారు.

గణపతి రావు తన జన్మలో యింతకన్నా అవమానంగాని, సిగ్గుపడాల్సిన సంఘటనకాని చూసి ఎరగడు. నెమ్మదిగా యింట్లోకెళ్ళి పక్కమీద పడుకుండి పోయాడు. ఓయి భగవానుడా! యీ పిల్లల్నిచ్చి యింత యాతనలు అనుభవించమని రాశావన్నమాట. రాజమ్మ కనక యీపైన ఆ విషయం ఎత్తినట్టయితే తన శక్తివున్నంత మటుకు కేకలేసితీరుతాడు. అవసరమైతే అంతకన్నా కూడా ఎక్కువ చేసేందుకు ఏమాత్రం వెనుతీయడు. యథారీతిగా పెళ్ళి సంబంధం జ్ఞాపకానికి తెచ్చింది రాజమ్మ. "నాకాసంబంధం చూడ్డం ఇష్టంలేదు రాజం అంతకన్నా పిల్లకి విషమిచ్చి చంపటం మేలు."

"ఇంతలోకి ఏమొచ్చిపడింది మీ బుర్రలో? మనపిల్లకి అంత సంబంధంకన్నా ఏమొస్తుందేం!..."

"పోనీయి, రాకపోతే మానె... నేనూ నువ్వూ బతికున్నమటుకు మనతో వుంటుంది ఆపైన ఏ పంచనో పని చేసుకుని బతుకుతుంది."

"ఈమాట నాకిదివరకు చెప్పారు కాదేం!... ఏదో నాటకమాడుదా మనుకుంటున్నారా? మీకీ ఆలోచనలు ఎవరెక్కించారు?"

"ఈమాట మన యింటాయనతో చెప్తే ఆయన మొహం తగలేశారు నన్ను! నేను బతికుండగా యిలాటి పాపపుపనులు చేయను."

"అయన్నే భరించమనండి యీ పిల్లని! నేను చూస్తూ దాన్నింక భరించలేను...అవుసరమైతే ఏ వంటపనో చేస్తూంటుంది వారింట్లో..."అని లేచి వెళ్ళిపోయింది.

అటు భార్యకి, యిటు సమాజానికి ఏం సమాధాన మివ్వాలోమటుకు తోచలేదు. లేచి వస్తుంటే వెనకాలే వచ్చి అన్నారు సర్వేశ్వరరావుగారు, "పిల్లనికూడా అడిగిచూడండి! పిల్లకూడా కాస్త జ్ఞానం అదీ తెలుసున్నది కూడాను..."

ఆ మాట వినేసరికి లీల తలదించుకుంది. కళ్లు మాత్రం చెమ్మగిలినట్టు స్పష్టంగా తెలిసింది. "నీయిష్టంనాన్నా" అని వెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చింది, తండ్రికి శరీరమంతా కత్తిపోట్లు పొడిచినట్టయింది. తన నిశ్చయం మాత్రం దృఢపర్చుకున్నాడు.

* * *

సుందరబాబుకింక వుండను వీలుకాదు. సెలవులుకూడా అయిపోయాయి. తను ఏది చేయాలో కూడా ఆలోచించుకో లేకపోయాడు. తన ఎడ్రసు కవరుమీద రాసి సిద్ధంగా రెండు తెల్ల కాయితాలు పెట్టి లీలకి ఎప్పుడేది జరిగేదీ రాయమని చెప్పి వెళ్ళిపోయాడు. తను ఎటువంటి ప్రమాద సమయంలోనైనాసరే, కృష్ణుడు ఆనాడు రుక్మిణి నెత్తుకుపోయినట్టు తను లీలను తీసుకుపోతానన్నాడు. సర్వేశ్వరరావుగారు భార్యతో తనకీ, గణపతి రావుకీ జరిగిన ఘర్షణ చెప్పేసరికి ఆశ్చర్యంగా అంది, "మధ్య మీరెందుకు కల్గచేసుకోవటం! వారి పిల్ల వారిష్టం, చేసుకునేవాళ్ళ యిష్టమూను. వాళ్ళ మొహాలకి అంతకుమించింది మాత్రం ఏమొస్తుందిలెండి..." అంది. ఈ సమాధానం విని తనూ ఏ జవాబు ఇవ్వలేకపోయాడు.

మళ్ళా జానకమ్మ వారిని యింట్లోంచి వెళ్ళగొట్టించాలని ప్రయత్నాలు జరుపుకుంటోంది. అవాళ సాయంత్రం పనికట్టుకుని వెళ్ళి చెప్పింది రాజమ్మతో—

"రాజమ్మా! మీరున్నందుకు నాకేమీ కష్టంగాని, నిష్టూరంగాని రాలేదు, యీ మూడేళ్లు అలాగే గడిచిపోయింది. నీ భర్తకూడా తేరుకుని మామూలులో పడ్డాడు. ఇక మా బాబు పెళ్ళి చేయాలని అనుకుంటున్నాను. ఇంకో నెల్లాళ్లకి సమంగా వాడి చదువు అవనూ అవుతుంది. ఈ యిల్లు అప్పటికి ఖాళీ అవాలనుకుంటాను."

నెమ్మదిగా యీమాట ఎందుకు అన్నదీ తను గ్రహించి రాజమ్మ జాలిగాఅంది. "అవును ఒదినా! లీల పెళ్ళికూడా చేయ్యాలని అనుకున్నా, దాని పెళ్ళయితే మేము యింకో పాకలోకూడా వుండేందుకు యిబ్బంది వుండకపోను...దానికొచ్చే సంబంధాలు ఎలావున్నయో చూస్తూనేవున్నారు. భగవానుడి దయవల్ల వారికి నయమయింది కనుక, వీలయితే మేము వేరేయిల్లు చూసుకుని పోదామనే అనుకుంటున్నాం. అంటే మీమీద కోపంగాని, మరేవిధమైన నెపంతో పోవటంలేదు ఒదినా...కేవలం మాకు యింక వుండను మొహమోటంగా వుండటంచేతనే అనుకోండి..." అని చెప్పింది.

సమంగా యిరవై రోజులకల్లా సూర్యారావుపేటలో ఒక యిల్లు చూసుకుని వేరైపోయారు రాజమ్మా వాళ్ళూ. దానివల్ల యిరువురి కుటుంబాలకు సమాన కష్టనష్టాలు మాత్రమే వుంటాయనుకుంటాను. గణపతిరావు ఆ యిల్లు వెతికి దాని అద్దె కూడా యింటినిబట్టి గుణించుకునే దిగాడు. ఒక గది, చిన్న వసారామాత్రం వుంది. వసారాకి చిన్న తడక అడ్డుపెట్టుకుని వంటలు చేసుకున్నారు. గోడలు, నేల కూడా మట్టివే. వర్షం వస్తే మటుకు యిల్లు ఏకమయిపోతుంది. అద్దె పది రూపాయలని మరీ దిగారు. అంత పేదరికంలోనూ, తన జిహ్వా కొసినా ఏమాత్రం తొణికేవాడు కాదు గణపతిరావు. వచ్చే వందకి ఖర్చు అణా పైసలతో సహా కన్పిస్తూనే వుంది.

సుందరబాబు యీమాటు వూరునుంచి వచ్చినదగ్గరనుంచి తల్లితో మాట్లాడలేకపోయాడు. లీలావాళ్లు మూడు వీధులు అవతలగా వున్నారు. సాయంత్రం సైకిల్ తీసుకుని లీల యింటికెళ్లాడు. లీల చూసి చకితురాలయింది.

"మీరు యింట్లో చెప్పివచ్చారా సుందర బాబూ?"

"చెప్పిరాకపోతే, చెప్పకుండానయినా వచ్చి తీరుతాను...యీ రాత్రి ఏదో తేల్చి చెప్పాలని

చూస్తున్నాను" అని అంటూండగానే తల్లి వచ్చింది. లీల సిగ్గుగా తల దించుకుని లేచి వెళ్ళిపోయింది.

* * * *

రాత్రల్లా తల్లి కొడుకుల మధ్య పెద్ద యుద్ధం ప్రారంభమయింది. తండ్రి అంతా విని ఎటూ మొగ్గలేక వూరుకున్నాడు. అందులోనూ కొంత అర్థమట్టుకుంది. లీలమీదఆయనకు ఏదో విధమైన అభిమానం కూడా. అది ఎంచేత కలిగిందోమటుకు చెప్పలేదు. అవసరం వచ్చినప్పుడు, లీల వంట కూడా చేసిపెట్టేది. ఆ రోజుల్లా జడ్జీగారు లీలకి కృతజ్ఞుడుగా వుండేవాడు. ఆయనకి చిన్న పిల్లలు ఏ పని చేసినా అమితానందంగా వుంటుంది.

"ఈ విషయంలో మాత్రం నీ చిత్తం వచ్చింది జరగదు బాబూ! ఇన్నాళ్ళ నిన్ను పెంచి పెద్దని చేసినందుకు, తల్లినయినందుకు నా కాపాటి అధికారం మివ్వాలి" అని అంది జానకమ్మ కోపంగా.

ఈ మాటకు సుందరబాబు జవాబుగా ఇంట్లోనుంచి నాలుగు రోజులు రాకుండా పోయాడు. తండ్రి భుజాన ఖండువా వేసుకుని చేతికర్రతో లీల యింటి కెళ్ళారు.

"ఏయ్ బాబూ! యిలారా ముందు" అని అన్నారు గంభీరంగా. అప్పుడు ఆయనలో కోపం గంభీరం అంతా ఏకమై మూర్తీభవించింది. సుందర బాబు బిత్తరచూపులతో వచ్చి ఎదట నిలబడ్డాడు.

"ఈ విధంగానేనా నీ తల్లితండ్రుల పరువు మర్యాదలు నిలబెట్టేది? నీ వైఖరేమీ నాకు నచ్చలేదు. పద-యింటికి" అని ఎవరివైపూ చూడకుండా వెళ్ళిపోయారు కొడుకుతో. గణపతిరావు పారెత్తిపోయాడు. రాజమ్మ కూతుర్ని ఇటువంటి దురంతపు పనిచేసిందని చెడ తిట్టిపోసింది. లీల అచేతన అయి వూరుకుంది.

ఇంటికి రాగానే తండ్రి కొడుకును ఆఫీసు గదిలో తన ఎదురుగా కూర్చోమని చెప్పి భార్యని పిలిపించారు. జానకమ్మ భర్త పక్కగా ఒదిగి కూర్చుంది.

"ఏరా సుందరబాబు! నీ వుద్దేశ్యం ఏమిటి? లీలని చేసుకోవాలనా నిజంగా, లేక నాటకమాడుదామనా?" అని అడిగేసరికి సుందరబాబు తల దించుకుని, నిరుత్తరు డయ్యాడు. "నే నేమి అడిగినా, నువ్వు సరిగ్గా జవాబివ్వాలి బాబూ! నేను ఆటకి పిలువలేదు. నీ యిష్ట మొచ్చింది జరిపించినా, దాని మంచిచెడ్డలకి మటుకు ఎన్నటికీ మేమే బాధ్యులం, నీకు ప్రపంచ జ్ఞానం వుంది... నాకు జవాబియ్యి, నిజంగా నీకు లీలని చేసుకోవాలని ఎన్నాళ్ళనుంచీ వుంది?"

"అదంతా నేను చెప్పలేను. కాని, నేను లీలని యిష్టపడి చాలా రోజులయింది. దానికి అంతు మాత్రం చెప్పలేను."

"అమ్మ కిష్టం లేకపోయినా, నా కిష్టం లేకపోయినా మానదల్చుకోలేదన్న మాట."

"ఏదైనా యిది కాకపోతే మరొకతని కొనుక్కొని తెచ్చుకునే వస్తువా నాన్నగారూ! లీలవంటి మనిషిని అడిగితే భగవంతుడే తిరిగి సృష్టించలేడు. ఇష్టమెలా వచ్చింది, కారణాలు, యివన్నీ అడిగితే మాత్రం నే నేం చెప్పను? ఒక క్షణంలో ఆ లీలనే చూడగానే చేసుకోవాలన్న కోరిక పుట్టించింది. అది బాహ్యంగాగాని ఆంతరంగికంగాగాని ఖిలువ కట్టి చెప్పలేను. అదెంతవరకూనంటే మీరు యిష్టపడకపోతే నేనే స్వతంత్రించగలను"అని చివాలున లేచి వెళ్ళిపోయాడు. జానకమ్మ కేసి తిరిగి అన్నారు నిస్పృహతో—

"నన్నేం చేయమంటావు జానకీ? గురితప్పిన రాయి, స్థితితప్పిన పిల్లల్ని, గురించి ఏమని అనేందుకు వీలుకాదు. దానికి అదే ప్రక్రియ. వాడెలాగూ యిష్టమయిన పని మానడు కనుక, మనమే వాడి కిష్టమయింది చేస్తే నయం" అని అన్నారు.

"ఏది ఏలా వున్నా ఒక్కడైపోయాడు నాకు" అని అంది తల్లి. తాళంచెవులు తీసుకుని గదికి తాళంవేసి పాతబట్టలు సర్దుకుని తండ్రి కేసి తిరిగి సుందరబాబు అన్నాడు మెల్లగా, "నాలుగు రోజుల్లో నేనూ లీలా తిరిగివస్తాం. డబ్బు వీలైతే పంపండి" ఆ మాటకి తల్లీతండ్రీ ఒకేసారి తల తిప్పారు అంగీకార సూచకంగా.

(సమాప్తము)